క్లుప్తంగా

మహిళలకు చేయూత



ఏలేశ్వరం మెప్మా మార్కెట్‌లో సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) చేయూతను ఇస్తోందని టీఎంసీ సాయికుమార్ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌ను ఆనుకుని గురువారం మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన దుస్తులు, వెదురు బుట్టలు, స్నాక్స్, ఫినాయిల్ తదితర వస్తువులను మెప్మా మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. ఈ సందర్భంగా టీఎంసీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు మెప్మా కృషి చేస్తోందన్నారు. డ్వాక్రా మహిళలు ఈ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షిచారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో సారా బట్టీలపై గురువారం దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఏలేశ్వరం మండలం తిరుమాలిలో సారా బట్టీలపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై వంశీరామ్, హెచ్‌సీ మల్లికార్జున, సిబ్బంది కిరణ్ పాండే, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: మండలంలో శృంగవరంలో సారా తయారు చేస్తున్న కొల్లు నానాజీని అరెస్టు చేసి, అతని నుంచి 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురంలో సారా తయారు చేస్తున్న కె.శ్రీనును అరెస్ట్ చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు వివరించారు.

100 రోజులు ఉపాధి పనులు కల్పించాలి

కిర్లంపూడి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తమకు ఏడాదికి వంద రోజులు పనులు కల్పించాలని ఉపాధి కూలీలు కోరారు. మండలంలోని బూరుగుపూడి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు అధ్యక్షతన గురువారం ఉపాధి గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా డీఆర్పీ గుజ్జాల రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన ఉపాధి పనులను పరిశీలించామన్నారు. ప్రధానంగా మస్టర్ల దిద్దుబాటు జరిగినట్టు తెలిపారు. మొక్కలు నాటేందుకు వచ్చిన డబ్బులను వినియోగించకుండా వెనక్కి పంపివేయడంతో ఉపాధి సిబ్బందిపై వీరంరెడ్డి కాశీబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద రోజులు పని కల్పించడంలో పలువురు మేట్లు అలసత్వం వహిస్తున్నారని ఉపాధి కూలీలు గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు.

చేతి పంపునకు మరమ్మతులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన చేతి పంపునకు ఎట్టకేలకు మరమ్మతులు పనులు చేపట్టారు. గత ఆరు నెలలుగా చేతి పంపు మరమ్మతులకు గురికావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఎంసీ చొరవతో స్కూల్ హెచ్ఎం రమణమూర్తి చేతి పంపును రిపేర్ చేయించారు. ఈ సందర్భంగా స్కూల్‌ను, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎస్ఎంసీ చైర్మన్ రామకుర్తి నాగబాబు, స్థానిక నాయకులు పరిశీలించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



కుశరాజు, అభినయ్

రౌతులపూడి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల హెచ్ఎం కోళ్ల రాంబాబు తెలిపారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 అథ్లెటిక్ పోటీల్లో రౌతులపూడి హైస్కూల్‌కు చెందిన శ్రీరంరెడ్డి కుశరాజు లాంగ్‌జంప్, షాట్ పుట్‌లో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఎనిమిదో తరగతికి చెందిన గొరికపూడి అభినయ్ డిస్క్ త్రోలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వీరిద్దరూ వచ్చే నెలలో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

దానా.. అమ్మో మళ్లీ వాన !

- రైతులను కలవరపెడుతున్న తుపాను
- పంట ఒబ్బిడి పనుల్లో బిజీ బిజీ
- జలాశయాల్లో సమృద్ధిగా నీరు



హెచ్.కొత్తూరులో కోతకు సిద్ధంగా ఉన్న ఖరీఫ్ వరిపంట

తుని రూరల్: రైతుల గుండెల్లో 'దానా' తుపాను దడ పుట్టిస్తోంది. ఫలసాయం చేతికి అందే పంట కాలం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రరూపం దాల్చి తుపానుగా మారినట్టు వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో తుపాను తీవ్రత అధికంగానూ, ఉత్తరాంధ్ర, కాకినాడ జిల్లాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. తుపాను కారణంగా వీచే ఈదురు గాలులు, వర్షాల ప్రభావం మరికొద్ది రోజుల్లో చేతికి అందనున్న ఖరీఫ్ పంటలపై పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి పంటకూ ముప్పు

ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో ఆరుతడిగా సాగవుతున్న పత్తి, అపరాల పంటలతో పాటు ఆలస్యంగా నాట్లు వేసిన వరిపైర్లకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. పత్తి సేకరణలో కొంతమంది రైతులు తలమునకలై ఉండగా పక్వానికి వచ్చే దశలో ఉన్న వరి, అపరాల రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. వరి, అపరాల కోతలు చేపడితే తుపాను తాకిడికి తడిసిముద్దవుతాయన్న భయం రైతుల్లో నెలకొంది. డిసెంబర్ వరకూ వర్షాలు, ఈదురు గాలులు లేక పోత ఫలసాయం చేతికి అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు ఇప్పటికే సాగునీటి వనరుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. తుపాను ప్రభావంతో వర్షాలు కురిస్తే సాగునీటి వనరుల పరిస్థితి ఆందోళనకరంగా మారనుంది.

మండలాల వారీగా పంటలు, ఖరీఫ్ సీజన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	పంటల విస్తీర్ణం (హెక్టార్లలో)	సాధారణ వర్షపాతం (మిల్లీ మీటర్లలో)	నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
తుని	2702	894	1091
కోటనందూరు	3993	667	1353
తొండంగి	4942	837	1117
శంఖవరం	833	880	1060
రౌతులపూడి	2539	880	1060

15009 హెక్టార్లలో..

వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ ఐదు మండలాల్లోని వరి, పత్తి, అపరాలు, చిరు ధాన్యాలు, తదితర పంటలు 15009 హెక్టార్లలో సాగవుతున్నాయి. తాండవ, పంపా, ఏలేరు రిజర్వాయర్లు, పుష్కర, పీబీసీ కాలువలతో పాటు 250కి పైగా చెరువుల్లో సాగునీటి నిల్వలు గరిష్ట స్థాయిల్లో ఆశాజనకంగా ఉన్నాయి. మరిన్ని వర్షాలు కురిస్తే గట్లు తెగిపోయే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే అధిక వర్షపాతం నమోదైంది. సబ్ డివిజన్ పరిధిలోని కోటనందూరులో అత్యధికంగానూ, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో అధికంగానూ, తుని మండలంలో సాధారణ వర్షపాతాలు నమోదయ్యాయి.

రిజర్వాయర్లలో నీటి నిల్వలు

తుని నియోజకవర్గంలో 380 అడుగుల గరిష్ట నీటి మట్టం గల తాండవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 377.07 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. 105 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల పంపాలో 99.54 అడుగులు, 283.99 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఏలేరులో 280.61 అడుగులు నీటి నిల్వ లు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల అవుతోంది. సాగునీటి చెరువుల్లోనూ ఖరీఫ్ సీజన్‌కు సరిపడా నీ టి నిల్వలు ఉన్నాయి.

పంట కోయాల్సి ఉంది

నాకు 1.5 ఎకరాల భూమి ఉంది. 60 సెంట్లలో పత్తి, 90 సెంట్లలో వరిపంట వేశాను. పత్తి తొలిపంట సేకరణ పూర్తయ్యింది. వరి పంట కోతకు వచ్చింది. తుపాను నేపథ్యంలో వర్షాలు పడతాయనే భయంతో వరికోత చేపట్టలేదు. భారీవర్షం కురిసినా, ఈదురు గాలులు వీచినా వరి కంకుల నుంచి గింజలు రాలిపోయే ప్రమాదం ఉంది.

– ఎం.సూరిబాబు, రైతు, హెచ్.కొత్తూరు

పంట ఒబ్బిడి చేసుకోవాలి

ఖరీఫ్ రైతులు సకాలంలో పంటలను ఒబ్బిడి చేసుకోవాలి. ప్రధానంగా పత్తి సేకరణ పూర్తి చేయాలి. పక్వానికి వచ్చిన వరిపైరు ఉంటే వర్షాభావ పరిస్థితులు గమనించి కోత కోయాలి. ఈదురు గాలులు, వర్షాలకు వరి పైర్లు నేలకు ఒరిగిపోకుండా మధ్యలో కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని



టి.తిమ్మాపురంలో పత్తి సేకరిస్తున్న రైతు కూలీలు



హెచ్.కొత్తూరులో గత నెలలో తుపానుకు దెబ్బతిన్న పత్తి పంట

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

జగ్గంపేట: నియోజకవర్గంలో డీఎస్సీ అభ్యర్థులకు శుక్రవారం నుంచి 110 రోజుల పాటు కోచింగ్ ఇవ్వనున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తెలిపారు. స్థానిక రావులమ్మ నగర్‌లో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే 600 మందికి 60 రోజుల పాటు టెట్ కోచింగ్ ఇచ్చామన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డీఎస్సీ కోచింగ్‌ను నియోజకవర్గంలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అప్పలరాజు, మాజీ ఎంపీపీ మారిశెట్టి భద్రం, జేవీఆర్ అధినేత జీను మణిబాబు, జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోవాలి

వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హత గల ప్రతిఒక్కరూ తమ వివరాలను తెలియపరచాలన్నారు. డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు గడిచిన ప్రతి ఒక్కరూ ఎన్‌రోల్ చేయించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు. రాజపూడి ఫీడర్ పరిధిలోని రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారామపురం, బాలాజీ రైస్‌మిల్లు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

తొండంగి: మండలంలోని దానవాయిపేటకు చెందిన దాత పెరుమాళ్ల చందు పేద విద్యార్థికి గురువారం ఆర్థిక సాయం అందించారు. తుని నోబుల్ ఐటీఐ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థి కె.లోకేష్‌కు ఫీజు నిమిత్తం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీనివాస్, బాబ్జి, సురేష్, ఏకాబు, జాను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో మండలంలోని ఒంటిమామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి, వచ్చే ఎన్నికల్లో విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా, దాడిశెట్టి రాజాను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి సంబంధించి పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, దేవవరపు సూర్యచక్రం, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, మండల కన్వీనర్ బద్ది నూకరాజు, జిల్లా కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీనాయకులు దడాల విజయబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న మిడ్డే మీల్స్ వర్కర్లు

గండేపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మిడ్డే మీల్స్ వర్కర్లు గురువారం గండేపల్లిలో ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై కక్షపూరిత చర్యలు మానాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. సింగరంపాలెంలో మిడ్డే మీల్స్ వర్కర్లు నొక్కు నూకరత్నం, రాండి నాగమణిలను అన్యాయంగా తొలగించారని, దీనికి నిరసనగా ఈ నెల 28న స్థానిక మండల కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మిడ్డే మీల్స్ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు ఊబ గంగమ్మ, సెక్రటరీ గంగూరి మరియమ్మ, సీఐటీయు మండల కార్యదర్శి ఎస్.లలిత, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు



గుమ్మళ్లదొడ్డిలో దీక్షా శిబిరం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణనాయక్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలు గురువారం మూడో రోజూ కొనసాగాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమకారుడు పాతం శెట్టి సూర్యచంద్రలకు మద్దతుగా పాతంశెట్టి శ్రీదేవి ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. దీక్షకు మద్దతుగా గ్రామస్తులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించగా పోలీసులు అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాయంత్రం దీక్షా శిబిరాన్ని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ సందర్శించి గ్రామస్తులతో చర్చించారు. ఈ సమస్యపై కమిటీని ఏర్పాటు చేస్తామని కమిటీలో గ్రామస్తులను భాగస్వామ్యం చేస్తామని చెప్పినప్పటికీ గ్రామస్తులు వ్యతిరేకించారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



డీఈఓ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థులు

శంఖవరం: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. కాకినాడలో స్వచ్ఛతా హి సేవ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఉప్పల సత్యమణి సురజ్, వై.బాల మురళీ పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఈఓ సర్టిఫికేట్, మెమెంటో అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

గొర్రెలకు నట్టల నివారణ టీకాలు

తొండంగి: మండలంలోని బెండపూడి, తొండంగి గ్రామాల్లో 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి బి.చైతన్య తెలిపారు. కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దినకర్, ఐఎస్‌డీపీ డాక్టర్ వై.యశ్వంత్‌నాయుడు పశు వైద్య శిబిరంలో గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. గొర్రెలు, మేకలకు సకాలంలో నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

టీవీ చూస్తూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: టీవీ చూస్తూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసు హెడ్ కానిస్టేబుల్ ఏవీఎస్ మూర్తి గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగపతినగరం కొత్తపేట గ్రామానికి చెందిన పులుగు శ్రీనివాస్ (42) ఉదయం 10 గంటలకు తన స్వగృహంలో టీవీ చూస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో మృతుడు భార్య ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై మృతుడు భార్య పులుగు లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వంతెన పనులు ప్రారంభించాలి

గోకవరం: గోకవరం ఠాణా సెంటర్‌లో ఊరకాలువపై నూతన వంతెన నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని మండల బీజేపీ నాయకులు కోరారు. గురువారం వంతెన నిర్మించే ప్రదేశాన్ని వారు పరిశీలించారు. గత ప్రభుత్వంలో రూ.10 కోట్లు నిధులతో శంకుస్థాపన చేసిన ఈ వంతెన పనులు అసంతృప్తిగా నిలిచిపోయాయని, దీంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర, బత్తుల వెంకన్నబాబు, ముప్పిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

శంఖవరం: స్థానిక కేజీబీవీలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన కిరణ్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం మేనేజర్ దంగేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు సుమారు 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కంటి శుక్లాలు ఉన్న విద్యార్థులకు ఉచితంగా వైద్యం చేస్తామన్నారు. విద్యార్థులు కంటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలాకుమారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



ధర్మవరంలో మురళీరాజును కలసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తానని ఆ పార్టీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన మురళీరాజును ఆయన స్వగ్రామం ధర్మవరంలో గురువారం అన్నవరం, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు అన్నవరం వీరవెంకటసత్యనారాయణ స్వామివారి చిత్ర పటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. పార్టీ నాయకులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో అన్నవరం ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, ఎంపీటీసీ దడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గండ్లు పూడ్చివేత పనుల పరిశీలన



రాజుపాలెంలో ఏలేరు కాలువకు పడిన గండి పూడ్చివేత పనులు పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ఏలేరు కాలువ గట్టుకు పడిన గండ్లు పూడ్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి. కాగా ఈ పనులను క్వాలిటీ కంట్రోల్ జేఈ హజర్‌హాలీఖాన్ గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు కిర్లంపూడి, జగపతినగరం, వీరవరం, ఎస్.తిమ్మాపురం, ముక్కొల్లు గ్రామాల్లో ఏలేరు కాలువ గట్టుకు గండ్లు పడ్డాయి. ఐదు గ్రామాల్లోను 11 చోట్ల ఏలేరు కాలువ గట్టు గండ్లను పూడ్చేందుకు సుమారు రూ.65.56 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు చేస్తున్నారు. దీనిపై ఏఈ శేషగిరిరావును వివరణ కోరగా ఏలేరు కాలువ గట్టుకు పడిన గండ్లను పూడ్చుతున్నామన్నారు. ఇప్పటికే 9 చోట్ల పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. మరో రెండు పనులు ప్రారంభించవలసి ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గంధం ఈశ్వరరావు, గొడె దొరబాబు, ఐసీఏ వై సత్యన్నారాయణ, దొడ్డాబత్తుల విజయ్ తదితరులు ఉన్నారు.

చెరువులో దొంగలు పడి.. చెట్లు నరికేసి..



రాజుచెరువులో నరికివేసిన దుంగలు

గోకవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెట్లు పెంచమని ప్రోత్సహిస్తుంటే కొందరు స్వార్థపరులు వాటిని నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రాజుచెరువు గట్టుపై ఉన్న పలు అరుదైన మారు జాతి వృక్షాలను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. నెమలి, తురాయి, ఊడుగ వంటి అరుదైన జాతులకు చెందిన సుమారు 20 నుంచి 25 వృక్షాలను నరికేశారు. సమీపంలోని రైతులకు నీడనిస్తూ ఎంతో ఉపయోగకరంగా ఉంటున్న వీటిని ఎవరి స్వార్థం కోసం నరికేసారోనని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనుక స్థానిక టీడీపీ నాయకుడి హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ ఏఈ నాగలక్ష్మి రాజుచెరువుని పరిశీలించారు. సంఘటనపై విచారణ నిర్వహించి బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే



పెద్దనాపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



ముక్కొల్లు గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

ఏలేశ్వరం: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని పెద్దనాపల్లిలో గురువారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రీసర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రీ సర్వే ద్వారా రైతుల భూములు ఆన్‌లైన్ చేస్తారన్నారు. సర్వే నంబర్లతో పాటు భూహద్దులు తదితర సమస్యలు ఉంటే రైతులు గ్రామ సభల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభకు 13 అర్జీలు

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెంలో గురువారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు 13 అర్జీలు అందినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. పేర్ల సవరింపు, ల్యాండ్ తక్కువ నమోదు వాటిపై ఈ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల సుబ్బు, వీఆర్వో లాజర్, అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభలతో రైతులకు మేలు

కిర్లంపూడి: భూముల రీ సర్వే గ్రామ సభలతో రైతుల భూ సరిహద్దు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తెలిపారు. మండలంలోని ముక్కొల్లులో సర్పంచ్ జ్యోతుల రాంబాబు అధ్యక్షతన తహసీల్దార్ జె.చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ గ్రామ సభను ఆర్డీఓ శ్రీరమణి సందర్శించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రావణి, వీఆర్వో మందేటి గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.